యాత్రాకథనం

# పరవశింపజేసే 'చిల్కా' అనుభవం

అపారమయిన జలరాసులు అంతులేని సౌందర్యంతో మిడిసిపడుతూ వుంటాయి. ఆకుపచ్చని నేలలు కళ్ళకి గొప్ప విందుని వడ్డిస్తూనే వుంటాయి. ఈ రెండు అద్భుతాలూ పయనించినంతమేరా మనల్ని వెన్నాడుతూ వుంటే అది 'చిల్క సరస్సు' యాత్రానుభవమౌతుంది. నీటిపై రెక్కలు సాచుకుంటూ రివ్వున ఎగిరే పిట్టల గుంపుల సవ్వడి గుండెల్లో మార్మోగుతూ వుంటుంది.

డిసెంబర్ 25, 26, 27 తేదీల్లో విశాఖపట్నం నుంచి చిల్క సరస్సు వరకు మేం చేసిన కారుయాత్ర మలుపు మలుపూ కొత్త అనుభూతుల కలగలుపు. సుమారు 350 కిలోమీటర్ల ప్రయాణంలో గమ్యం ఆ సరస్సు అయినప్పటికీ మధ్యమధ్యలో అనేక చారిత్రాత్మక ప్రదేశాలనూ చూశాం.

డిసెంబర్ 25 ఉదయం 5.30 ని॥లకు విశాఖలో బయల్దేరాం. నేషనల్ హైవే చేతులు విశాలంగా సాచి ఆహ్వానించింది. ఖాళీగా వున్న రోడ్లపై రయ్యిన దూసుకుపోగా ఉదయం 8.30 ని॥లకు బరంపురం చేరుకున్నాం. కాళీపట్నం రామారావు మాస్టారి బంధువు ఎమ్మెల్సీ గంగరాజు సాదరంగా ఆహ్వానించి మాకు కావలసిన సదుపాయాలు కల్పించారు. తెలుగు సాహిత్యం పట్ల మమకారంతో ఒంటరి పోరాటం చేస్తున్న కామేశ్వరరావు, జీవన్‌గార్లను ఇక్కడే కలిసాం. బరంపురం ఒరిస్సాలో ఉన్నప్పటికీ తెలుగు మాట్లాడే ప్రజలు ఎక్కువ. తెలుగు సాహిత్యం పట్లా మక్కువ ఎక్కువే. ఆధునిక భావజాలాన్ని త్వరగా అందిపుచ్చుకుని సహపంక్తి భోజనాల ద్వారా గురజాడ సమానత్వాన్ని చాటిచెప్పిందీ ఇక్కడే.

1973లో స్థాపితమైన వికాసం సాహిత్య సంస్థ ఇప్పటికీ వుంది. శ్రీశ్రీ, ఉప్పల లక్ష్మణరావు, కాళీపట్నం రామారావు, అవసరాల రామకృష్ణారావు, వరవరరావు, కె.శివారెడ్డి లాంటి సాహితీవేత్తలతో సమాలోచనలకి 'వికాసం' చేసి కృషిని ఈ సందర్భంగా తెలుసుకున్నాం. జాతీయోద్యమం మితవాద దశలో వున్న కాలంలోనే సుమారు 104 సంవత్సరాల కిందట ఆంధ్ర మహిళా సమాజం ఏర్పడింది. 104వ వార్షికోత్సవానికి ఆ సంస్థ సెక్రటరీ కామేశ్వరి ఆహ్వానం మేరకు ఆ సభలో పాల్గొన్నాం. ఆంధ్ర మహిళా సమాజం లక్ష్యాలు, ఆచరణ విస్తృతంగా లేకపోయినప్పటికీ శతాబ్దంపైగా అవిచ్ఛిన్నంగా ఒక సంస్థ మహిళల ఆధ్వర్యంలో నడవడం అభినందించదగిన విషయం. ఆంధ్ర మహిళా సమాజం ఆధ్వర్యంలో తెలుగు భాషాభివృద్ధి నిమిత్తం వారాంతంలో 'తెలుగుబడి'ని నిర్వహిస్తున్నారు. ఆ రోజంతా బరంపురంలోని సాహిత్య, సాంస్కృతిక, భాషా సంబంధ విశేషాలను తెలుసుకున్నాం. సాయంత్రం గోపాల్‌పూర్ బీచ్ ఫెస్టివల్ చూశాం. ఒరియా కళారూపాల ప్రదర్శన జరిగింది. వస్తు విక్రయాల కోసం పెట్టిన అనేక స్టాల్స్‌లో వాతావరణం తిరణాల మాదిరిగా అన్పించింది. రాత్రికి బరంపురంలో బస చేశాం. అక్కడ హోటళ్ళలో వసతి ఖరీదు చాలా తక్కువ. నాన్ ఏసి గది రూ. 250/-లు. ఏసి గది రూ.350/-లు. 26వ తేదీ ఉదయం బరంపురం నుంచి ఐ.ఎన్.ఎన్. చిల్కకి బయల్దేరాం. మధ్యలో ఛత్రపూర్ వద్ద మిత్రులు భమిడిపాటి శ్రీనివాస్ మాతో కలిసారు. ఆ ప్రాంతం మీద పూర్తి పట్టున్న వ్యక్తి కావడంతో అనేక విషయాల్లో మమ్మల్ని గైడ్ చేశారు. ఛత్రపూర్‌లో ఎక్కడ చూసినా కోతులే! ఆ మేడ మీద నుంచి ఈ మిద్దె మీదికి, ఈ మిద్దెమీద నుంచి యింకో డాబా మీదికీ దూకుతూ హడావిడి చేస్తున్నాయి. ఛత్రపూర్ దాటాక ఒక ఆశ్రమం కన్పించింది. దాని చరిత్ర ఆసక్తికరంగా వుంది. ఈ ఆశ్రమంలో ఇద్దరు స్వామీజీలు దీక్షలో వుంటారు. భృగుసంహిత గ్రంథాలను అధ్యయనం చేసినవారు, అక్కడికి ఎవరు వెళ్ళినా వారు పూర్వజన్మలో ఏ రూపంలో జీవించారో చెప్పగలరని ప్రతీతి.

అక్కడ నీటిపై రెక్కలు సాచుకుంటూ రివ్వున ఎగిరే పిట్టల గుంపుల సవ్వడి గుండెల్లో మార్మోగుతూ వుంటుంది. మన కళ్లకి ఒక గొప్ప విందు!

అక్కడనుంచి కొంత దూరం వెళ్ళాక రుషికుల్యనది మీదుగా కట్టిన వంతెన కనిపిస్తుంది. నది నీరు పల్చగా పారుతోంది. కొంత దూరం తర్వాత ఈ నది సముద్రంలో కలుస్తుంది. కొంత దూరం వెళ్ళాక హ్యూమ గ్రామం ఎదురయింది. ఆ ప్రదేశాన్నంతటినీ సాల్ట్‌బెల్ట్‌గా వ్యవహరిస్తారు. అక్కడ గడ్డ ఉప్పు తయారుచేస్తారు. అది గృహావసరాలకి వాడే అయోడైజ్డ్ ఉప్పు కాదు. ఫ్యాక్టరీల అవసరాల నిమిత్తం గడ్డ ఉప్పుని భారీ ఎత్తున తయారుచేసి ఎగుమతి చేస్తున్నారు. అది దాటి ముందుకెళ్ళినపుడు రోడ్డుకి ఇరువైపులా కిక్కిరిసిన మొగలిపొదలు కన్పించాయి. మొగలిపువ్వుని ఇక్కడివారు 'కెవడా' అని పిలుస్తారు. మొగలిపువ్వుల నుంచి అత్తరు తీసి ముస్లిం దేశాలకు ఎగుమతి చేస్తారు. కనోజ్, మధుర ప్రాంతాల నుంచి అత్తరు తయారుచేసేవారు ఇక్కడ పని చేస్తున్నారు. పది వేల మొగలిపువ్వులను ఉడకబెడితే ఒక ఔన్సు శ్రేష్టమయిన మొగలి అత్తరు వస్తుందని, ఇది చాలా విలువయిందనీ అక్కడివారు చెప్పారు. ఆ వరుసలోనే ప్రసిద్ధ దక్షిణ కాళీ దేవాలయాన్ని చూశాం. రంభా విలేజ్ నుంచి మా ప్రయాణం సాగింది. ఆ చుట్టుపక్కల ప్రాంతమంతా ఉప్పునీటితో నిండి వుంటుంది. మామూలు రోడ్లు త్వరగా పాడవుతాయి. కాబట్టి సిమెంటు రోడ్లు వేస్తారని గ్రహించాం. తర్వాత హాళ్ళికోట సంస్థానం మీదుగా ప్రయాణం సాగించాం. ఆ సంస్థానాధీశురాలు ఏడుసార్లకు పైగా ఒరిస్సా అసెంబ్లీకి ఎంపియ్యారు. ప్రస్తుతం ఆమె బిజెపి ఎమ్మెల్యే. ఆ ప్రాంతమంతా అడవులతో నిండి వుంది. అపుడపుడూ ఏనుగులు మొదలైన జంతువులు రోడ్డుపైకి వస్తాయని తెలిసినపుడు ఆశగా చుట్టుపక్కల చూశాను. అక్కడికి సమీపంలోనే నిర్మల్‌జొర ఆలయం వుంది. స్వచ్ఛమైన జలధార అనే అర్థం వచ్చే ఈ గుడి ఒరియా వారికి పవిత్రమైంది. అక్కడ వున్న మామిడితోటలో కోతులు కుప్పిగంతులు వేస్తున్నాయి. వాటిని తోలడానికి ఆ తోట కాపలావారు ఒక చేత్తో పెద్ద కర్ర, మరో చేత్తో మండుతున్న కట్టె పట్టుకుని నోటితో చిత్రమైన శబ్దాలు చేస్తూ కన్పించాడు.

ఐ.ఎన్.ఎన్. చిల్క చేరడానికి ముందే విష్ణువు కొలువుండే 'నారాయణి' గుడిని చూశాం. మధ్యాహ్నం ఒంటిగంటకి చిల్క సరస్సు చేరాం. అల్లంత దూరంలోనే ఆకుపచ్చని జలరాశిని చూడగానే హృదయం ఆనందంతో గంతులు వేసింది. అక్కడ ఉన్న ఒక రెస్టారెంట్‌లో భోజనం చేశాం. దేశ విదేశాల టూరిస్టులతో కోలాహలంగా ఉంది. బంగాళాదుంపల వేపుడు, పుట్ట గొడుగుల కూర నోటికి కొత్తగా, రుచిగా అన్పించాయి.

మా అయిదుగురితోపాటు ఇంకో అయిదుగురు టూరిస్టులను కలుపుకుని సరస్సుపై విహారానికి బోటు మాట్లాడుకున్నాం. సరస్సు మధ్యన పక్షులు విడిదిచేసే చోటు, కాళీజై గుడి వున్న ఐలెండ్ చూపించడానికి 1100 రూ॥లు తీసుకున్నారు. సరస్సు ఒడ్డున అనేక రకాల పడవలు చూశాం. 'ఫ్లోటింగ్ రెస్టారెంట్' పడవ కొత్తగా వుంది. అన్నింటికన్నా అందంగా, ఠీవిగా బంతిపూలతో అలంకరించిన 'లతిక' హౌసింగ్ బోట్ అందరినీ ఆకర్షించింది. ఒరిస్సా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (OTDC) వారిచేత 'లతిక' నడపబడుతోంది. 2.10 గం॥కి మేమెక్కిన బోటు బయల్దేరింది. 3.30కల్లా పక్షులు విడిది చేసే చోటుకు చేరుకుంది. అనుకున్న స్థాయిలో పక్షులు లేవు. అక్కడక్కడా గుంపులుగా ఎగిరిన పక్షుల్నీ, నీటిమీద కాగితం పడవల్లా తేలుతున్న పక్షుల్నీ చూసి సంతోషపడ్డాం. ఈ సీజన్‌లో ఉక్రెయిన్, సైబీరియా లాంటి ప్రాంతాల నుంచి 4,000 కిలోమీటర్ల మేర దూరం పక్షులు అవిశ్రాంతంగా ఎగురుతూ ఇక్కడికి వస్తాయని తెలిసింది.

మామూలుగా చిల్క సరస్సు లోతు 50, 60 అడుగులు వుంటుంది. కానీ పడవ ఆగిన దగ్గర 12 అడుగుల లోతు మాత్రమే వుంది. పడవ అంచున కూర్చుని పాదాలు నీళ్ళలోకి జారవిడిచినపుడు బుల్లిబుల్లి చేప పిల్లలు కాళ్ళకి తగిలి గిలిగింతలు పెట్టాయి. అడుగున వున్న నాచు మూలంగా సరస్సు లేత గచ్చకాయ రంగులో వుంది. పైకి లేత ఆకుపచ్చ రంగులో కనిపించే చిన్ని అలల మీద సూర్యదీపాల నృత్యం చూడముచ్చటగా వుంటుంది. పది నిమిషాలు అక్కడ గడిపిన తర్వాత 3,40కి బయల్దేరిన బోటు నాలుగున్నరకి కాళీజై గుడికి చేరుకుంది. ఈ గుడికి రవళోజాతి వారు పూజారులుగా వ్యవహరిస్తున్నారు. గుడివెనుక వున్న ఒక నూతిలోకి భక్తులు నాణేలు విసురుతున్నారు. ఈ నూతిని కాళీజైజోలా అంటారు. నూతి అడుగున సిమెంట్ నేల, కొంతమేర నీరు, నీటికింద పోగు పడిన నాణేలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. గుడి వెనుక చిన్న కొండ వుంది. మెట్ల దారిగుండా వెళ్తే శిఖరానికి చేరుకోవచ్చు. అక్కడ నెమళ్ళు నాట్యమాడుతూ కన్పించాయి. అయిదు రోజులుగా సరస్సు మీదే విహరిస్తున్న కొందరు ఒరియా యువకులు అక్కడే వంటలు చేసుకుని నేలమీద విస్తళ్ళు పరుచుకుని భోజనం చేస్తూ కన్పించారు. చిల్క సరస్సు ఇముడ్చుకున్న ఏ రహస్యాల కోసమో వారి అన్వేషణ అన్పించింది. సాయంత్రం 5 గంటలకి తిరుగు ప్రయాణమయ్యాం. ఇక్కడ పడవ నడుపుతున్న వ్యక్తి తెడ్డువేస్తూ జర్రున జారి నీళ్ళలో పడ్డాడు. అంతా పొట్ట చెక్కలయ్యేలా నవ్వినా ప్రయాణీకులు నీళ్ళలో పడితే ఆ పడవలో ఎలాంటి రక్షణ సదుపాయాలూ లేకపోవడం గురించి ఆలోచన రాగానే నవ్వులు ఎగిరిపోయాయి. పడవ నడిపే వ్యక్తి మాత్రం నీళ్ళని చీల్చుకుని ఎగసే పిల్ల డాల్ఫిన్‌లా పడవ మీదికి ఎగిరి మమ్మల్ని చూసి సిగ్గుగా నవ్వి మళ్ళీ తెడ్డు అందుకున్నాడు. 5.30కి ఒడ్డుకు చేరుకున్నాం.

ఆ రాత్రి ఛత్రపూర్‌లో బస చేశాం. ఛత్రపూర్‌లో రిటైర్డ్ పోలీసాఫీసర్, సాహితీకారుడు అయిన సరివల్లి రామారావుని కలిసాం. డెబ్బై అయిదేళ్ళ వయసులోనూ యవ్వనోత్సాహంతో ఛలోక్తులు విసురుతూ తెలుగు సాహిత్యం గురించీ, అనువాదాల గురించీ ఆయన చాలాసేపు మాట్లాడారు.

డిసెంబర్ 27 ఉదయం విశాఖకు తిరుగు ప్రయాణమయ్యాం. మార్గమధ్యంలో పలాస దగ్గర జీడిపప్పు ఫ్యాక్టరీలను చూశాం. జీడిపప్పు తయారీవెనుక మహిళల శ్రమే అధికం. కాల్చిన జీడిపిక్కలు వలవడానికి కేజీకి ఎనిమిది రూపాయల ఇరవై అయిదు పైసలు ఇస్తారని తెలిసింది. మధ్యాహ్నానికి విశాఖపట్నం చేరుకున్నాం.

ఒకసారి యాత్రానందం అనుభవమయ్యాక పాదాలు కాంక్షని నింపుకుని ఎదురుచూస్తూ వుంటాయి. చిల్క ప్రయాణం ఇచ్చిన అనుభూతులు, జ్ఞానం ఆ ఎదురుచూపులకి మరిన్ని పరిమళాలను అద్దాయి. ఈ విశాల విశ్వం నా పాదాలను ఆహ్వానిస్తూ దయగా చూస్తోంది.

– మల్లీశ్వరి


చిల్కా సరస్సు


ఇటువంటి రమణీయ దృశ్యాలు అక్కడ ఎన్నో


సరస్సులో బోటింగ్ రెడీ

ఒకసారి యాత్రానందం అనుభవమయ్యాక పాదాలు కాంక్షని నింపుకుని ఎదురుచూస్తూ వుంటాయి. చిల్క ప్రయాణం ఇచ్చిన అనుభూతులు, జ్ఞానం ఆ ఎదురుచూపులకి మరిన్ని పరిమళాలను అద్దాయి.

